
దర్జాగా ఆలయ భూముల ఆక్రమణ





- జిల్లాలో కబ్జాపాలైన 86 ఎకరాలు
- ఫలితమివ్వని గత సర్వే నివేదికలు
- తారుమారైన రికార్డులు
- పట్టించుకోని అధికారులు

నిర్మల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని దేవాదాయశాఖ భూములు పెద్దఎత్తున ఆక్రమణలకు గురవుతున్నప్పటికీ ఆ దిశగా చర్యలు తీసుకునే వారే కరువయ్యారంటున్నారు. ఈ భూముల ఆక్రమణలపై ఫిర్యాదులు వెల్లువెత్తడంతో రెండేళ్ల క్రితం అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం భూముల సర్వేను చేపట్టింది. అయితే తమ వద్ద అందుబాటులో ఉన్న రికార్డుల ఆధారంగా సర్వే చేపట్టిన అధికారులు జిల్లాలో 72 ఆలయాల పరిధిలో 1381. 07 ఎకరాల భూములున్నట్లు నిర్ధారించారు. అందుబాటులో ఉన్న రికార్డుల ప్రకారం సర్వే నిర్వహించిన అధికారులు దాదాపు 86.28 ఎకరాల భూములు ఆక్రమణలకు గురైనట్లు నివేదికలు రూపొందించారు. అయితే ఈ ఆక్రమణలపై మాత్రం ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అప్పటి అధికార పార్టీ నేతల ప్రమేయం కారణంగానే అధికారులు చర్యలు తీసుకునేందుకు వెనకాడారన్న ఆరోపణలున్నాయి. ఈ భూముల ఆక్రమణల్లో అప్పటి అధికార పార్టీ నేతలు, మరికొంతమంది రాజకీయ నాయకుల హస్తం ఉన్నట్లు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. రాజకీయ అండదండల కారణంగానే అధికారులు చర్యలు తీసుకునేందుకు వెనకాడారన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. రాజకీయ ఒత్తిళ్ల కారణంగా ఈ ఆక్రమణలకు సంబంధించిన నివేదికలు బుట్ట దాఖలయ్యాయని అంటున్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం దేవాదాయశాఖ భూముల ఆక్రమణలపై మరోసారి విచారణ జరిపి కబ్జాలో ఉన్న భూములను స్వాధీనం చేసుకోవాలని కోరుతున్నారు.

స్పెషల్ డ్రైవ్‌తో ఆక్రమణలు వెలుగులోకి..

జిల్లాలో దేవాదాయశాఖ భూముల ఆక్రమణలపై ఫిర్యాదులు వెల్లువెత్తడంతో అప్పటి ప్రభుత్వం తప్పనిసరి పరిస్థితుల్లో స్పెషల్‌డ్రైవ్ పేరిట భూముల సర్వే చేపట్టింది. ఈ సర్వే ఆధారంగా 1081.09 ఎకరాల భూములు సంబంధిత ఆలయాల అర్చకుల పరిధిలో ఉన్నట్లు నిర్ధారించారు. అలాగే మరో 53.12 ఎకరాల భూములు అధికారికంగా దేవాదాయశాఖ ద్వారా కొంతమందికి లీజుకు ఇచ్చారు. దీంతో పాటు 59.12 ఎకరాల భూములు ప్రస్తుతం దేవాదాయశాఖ ఆధీనంలో ఉన్నట్లు అధికారులు ఈ స్పెషల్‌డ్రైవ్ నివేదికలో పేర్కొన్నారు. అలాగే 86.28 ఎకరాల దేవాదాయశాఖ భూములు ఆక్రమణలకు గురైనట్లు సైతం తమ నివేదికల్లో స్పష్టం చేశారు.

క్రిమినల్ చర్యలు.. సిఫారసులు బుట్టదాఖలు

కాగా అప్పటి ప్రభుత్వం దేవాదాయశాఖ భూముల ఆక్రమణలకు పాల్పడిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని ప్రకటించింది. అయితే సంబంధిత శాఖ అధికారరులు స్పెషల్‌డ్రైవ్ నిర్వహించి ఆక్రమణలను నిర్ధారించి చర్యలకు సిఫారసు చేశారు. అయితే రాజకీయ ఒత్తిళ్ల కారణంగా ఈ చర్యలకు సంబంధించిన సిఫారసులు బుట్టదాఖలయ్యాయి. అలాగే దేవాదాయశాఖ భూములకు సంబంధించిన రికార్డులు సైతం తారుమారు చేశారన్న ఫిర్యాదులున్నాయి. ముఖ్యంగా రెవెన్యూ, దేవాదాయ శాఖ మధ్య సమన్వయ లోపం కారణంగా కొంతమంది రికార్డులను మాయం చేసి కొత్త రికార్డులను తమకు అనుకూలంగా మలుచుకుంటున్నారన్నారు.

బాసరలో అక్షయ తృతీయ సందడి

- భారీగా అక్షర శ్రీకార పూజలు



చిన్నారులకు అక్షర శ్రీకారం జరిపిస్తున్న అర్చకులు

బాసర, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : చదువుతల్లి బాసర సరస్వతీదేవి నిలయం బుధవారం భక్తుల సందడి నెలకొంది.అక్షయ తృతీయ పర్వాదినాన్ని పురస్కరించుకొని భక్తుల తాకిడి పెరిగింది.దీనికి తోడు అక్షర శ్రీకార పూజలకు అనువైన శుభదినం కావడంతో తెలుగు రాష్ట్రాలతో పొరుగున ఉన్న మహారాష్ట్ర నుండి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.పవిత్ర గోదావరి నదిలో పుణ్య స్నానలు అచరించి అమ్మవారిని దర్శించుకున్నారు.రెండు అక్షర శ్రీకార మండపాలు పిల్లలకు పూజలు జరిపించే భక్తులో దినమంతా కిటకిటలాడాయి.రూ.1000 టికెట్ గల మండపంలో 514 మంది, రూ 150 టికెట్ గల మండపంలో 264 మంది చిన్నారులకు అక్షర శ్రీకార పూజలు జరిగాయి. అమ్మవారి దర్శనం ,పూజల కోసం భక్తులు దాదాపు మూడు గంటలు వేచి ఉండాల్సి వచ్చింది.



అక్షర శ్రీకార మండపంలో భక్తుల రద్దీ

సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండండి

- వెంకటాపూర్‌లో పోలీసుల అవగాహన



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. బుధవారం వెంకటాపూర్ గ్రామంలో నారిశక్తి కార్యక్రమంలో భాగంగా పోలీసు అక్క కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు సైబర్ నేరాలు, మైనర్ డ్రైవింగ్, ఫోక్సో చట్టాలపై అవగాహన కల్పించారు. ఇటీవల సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని సామాజిక మాధ్యమాల పట్ల అప్రమత్తత అవసరమన్నారు. మహిళల పట్ల అసభ్యంగా వ్యవహరించిన వారిని వేధించిన ఫోక్సో చట్టం కింద కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ అధ్యాపకుల ఆందోళన విరమణ



వీసీ గోవర్ధన్‌ను కలిసి సమ్మె విరమిస్తున్నట్లు ప్రకటిస్తున్న మెంటర్స్

బాసర,ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : బాసర ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీలో గత కొన్ని రోజుల నుంచి రెగ్యులరైజేషన్ ప్రధాన డిమాండ్‌తో కాంట్రాక్ట్ పద్దతిలో పనిచేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్లు, మెంటర్స్ బుధవారం తమ ఆందోళనను విరమించారు. వీసీ గోవర్ధన్ సమావేశమై ప్రభుత్వం సానుకూల దృక్పథంతో ఉందని, సమస్యలు పరిష్కారమయ్యే దిశగా ఉన్న విషయాన్ని అధ్యాపకులకు వివరించడంతో వెనక్కితగ్గారు. రెండు వర్గాల ఉద్యోగులు వేర్వేరుగా వీసీని కలిసి ఆందోళన విరమిస్తున్నట్లు ప్రకటించారు.



వీసీ గోవర్ధన్‌ను కలిసిన అసిస్టెంట్ ప్రొఫెసర్లు

ఆర్జీయూకేటీ వీసీకి ఇండిగ్లోబల్ లీడర్షిప్ అవార్డ్



అవార్డును అందుకుంటున్న వీసీ తరపు సంబంధీకులు

బాసర, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : బాసర ఆర్జీయూకేటీ వైస్ చాన్సలర్ గా పనిచేస్తున్న గోవర్ధన్‌కు ఇండిగ్లోబల్ లీడర్షిప్ అవార్డు లభించింది. విద్యారంగంలో విశిష్ట సేవలకు గుర్తింపు ఈ అవార్డు అందుకున్నట్లు యూనివర్సిటీ అధికారులు తెలిపారు. ఇండిగ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెస్టివల్ భారతదేశంలో ప్రముఖ విద్యా సంస్థల సీనియర్ ప్రొఫెసర్లు, పారిశ్రామికవేతలు, పాలసీ మేకర్ల సమక్షంలో నిర్వహించబడే ప్రతిష్టాత్మక వేదిక. ఈ వేదికపై వీసీ గోవర్ధన్ నాయకత్వం, శ్రద్ధ, దూరదృష్టిని ప్రశంసిస్తూ హైదరాబాద్ పార్క్ హయత్ హోటల్‌లో ఇండిగ్లోబల్ లీడర్షిప్ అవార్డ్-2025 ను ప్రదానం చేశారు. జాతీయ అంతర్జాతీయ స్థాయిలో పరిశోధనలు, 555 పైగా పబ్లికేషన్లు, టెక్నాలజీ ఆధారిత విద్యా విధానాల అభివృద్ధికి కృషి చేశారని యూనివర్సిటీ వర్గాలు తెలిపాయి,

'ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి'

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : మహిళలు నైపుణ్యాబివృద్ధి పెంపొందించుకునేందుకు ఇచ్చే ఉచిత శిక్షణ సద్వినియోగం చేసుకోవాలని స్వామి రామానంద తీర్థ గ్రామీణ శిక్షణ సంస్థ చైర్మన్ కిషోర్‌రెడ్డి అన్నారు. బుధవారం ప్రియదర్శిని నగర్ ప్రాంతంలో శిరిడి సాయి సేవా సొసైటీ ఆదిలాబాద్‌తో కలిసి రామానంద తీర్థ సంస్థ ఉచిత శిక్షణ ప్రారంభించింది. ముఖ్యఅతిథిగా ముత్యంరెడ్డి పాల్గొని మాట్లాడారు. జగదీశ్‌రెడ్డి, అశోక్, అమ్మ ఫౌండేషన్ చైర్మన్ అంజనేయులు, కూన సుకుమార్ తదితరతులున్నారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయండి

- వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : యాసంగి సీజన్‌లో ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని పౌర సరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం కమిషనర్ డిఎస్ చౌహాన్‌తో కలిసి కలెక్టర్లు, పౌర సరఫరాలశాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో ఈ యాసంగిలో 54.89లక్షల ఎకరాల్లో సాగు చేయగా 1.37 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం అంచనా వేసినట్లు తెలిపారు. ప్రభుత్వం ద్వారా 70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంటుందన్నారు. తరుగు పేరిట అదనంగా ధాన్యం తీసుకోవద్దని సూచించారు. గోదాంలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే జిల్లాలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్, భైంసా ఆర్డీఓ కోమల్‌రెడ్డి, పౌర సరఫరాల శాఖ మేనేజర్ సుధాకర్, వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్, మార్కెటింగ్ ఏడి గజానంద్ తదితరులున్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్

ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తా

- ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్‌రూరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ఎల్లారెడ్డిపేట్ గ్రామంలో శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయ విగ్రహ ప్రతిష్టాతపన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఆలయ ప్రారంభానికి శంకుస్థాపన చేసి ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు జమాల్, అధ్యక్షులు వెంకట్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ మెంబర్ అనిల్, ఓడిసెల అర్జున్ తదితరులున్నారు.

బసవేశ్వర జయంతిలో పాల్గొన్న ఎమ్మెల్యే

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో బుధవారం బసవేశ్వర మహరాజ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి బసవేశ్వర మహరాజ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పట్టణ బీజేపీ అధ్యక్షులు ఆకుల కార్తీక్, నాయకులు సుంకరి రాజు, వీరేష్, అచ్యుత్‌రావు తదితరులున్నారు.



నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

మహిళలు అప్రమత్తంగా ఉండాలి

- భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్



ఓలాలో మహిళను సన్మానిస్తున్న ఏఎస్పీ అవినాష్ కుమార్

కుంటాల, ఏప్రిల్, 30 : (ఆంధ్రజ్యోతి) : మహిళలు ఏల్లవేళలా అప్రమ త్తంగా ఉండాలని భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్, సీఐ నైలు అన్నారు. బుధ వారం కుంటాల మండలంలోని ఓలా గ్రామంలో నారిశక్తి కార్యక్రమంలో మహి ళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళా కానిస్టేబుల్‌లు కవిత, అశ్విని, తదితరులు, కుంటాల ఎస్సై అశోక్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏఎస్పీ మాట్లాడుతూ మహిళలు 100 డయల్‌ను సద్వినియోగ పరుచుకోవాలన్నారు. ఎలాంటి విపత్కర పరిస్థితుల్లోనైనా నంబర్‌కు కాల్ చేస్తే సహాయం అందించేందుకు తమ సిబ్బంది ఎల్లవేళలా అందుబాటులో ఉంటా రన్నారు. ఈ సందర్భంగా పలువురు మహిళా వృద్దులను ఏఎస్ఐ, కుంటాల పోలీసుల ఆధ్వర్యంలో సన్మానించారు. ప్రభుత్వం మహిళల సంక్షేమం కోసం ఎన్నో కార్యక్రమాలు చేపడుతుందని వాటిని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



ఓలాలో మాట్లాడుతున్న ఏఎస్పీ అవినాష్‌కుమార్

ఘనంగా భీం జయంతి



ఉమ్రి(కే) భీం జయంతి నిర్వహిస్తున్న దృశ్యం

తానూర్ , ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉమ్రి(కే) గ్రామంలో బుధవారం ఘనంగా భీం జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా డా. బాబాసాహెబ్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేద, బడుగు, బలహీన వర్గాలకు ఆయన చేసిన సేవలను పలువురు నాయకులు వివరించారు. ప్రత్యేక వాహనంలో అంబేడ్కర్ చిత్రపటాన్ని ఉంచి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా తిరుగుతూ శోభయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశారు.

జిల్లా కేంద్రం మీదుగా

హైదరాబాద్‌కు బస్సు సర్వీసు ప్రారంభం


భైంసా, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి డిపో నుంచి నర్సాపూర్ (జి), నిర్మల్ మీదుగా హైదరాబాద్‌కు కొత్తగా బస్సు సర్వీసును ప్రారంభించినట్లుగా భైంసా బస్సు డిపో మేనేజర్ హరి ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజు ఉదయం 5 గంటలకు భైంసా బస్టాండ్ నుంచి సంబంధిత బస్సు హైదరాబాద్‌కు బయలుదేరుతుందని పేర్కొన్నారు. ఇదే క్రమంలో సాయంత్రం 6 గంటలకు హైదరాబాద్ నుంచి తిరిగి భైంసాకు బస్సు బయలుదేరుతుందని తెలిపారు. ప్రయాణీకులు సంబంధిత బస్సు సర్వీసు సేవలను సద్వినియోగపరుచుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అత్యాచారం కేసులో ఒకరికి జైలు

తానూర్ , ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఓ గ్రామానికి చెందిన దిలీప్(28) అనే వ్యక్తికి అత్యాచారం కేసులో జైలుశిక్ష ఖరారైనట్లు ట్రైనీ ఎస్సై నవనీత్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... 2020 జనవరి 1వ తేదీన నిందితుడు దిలీప్ మహిళపై అత్యాచారానికి పాల్పడిన కేసులో బుధవారం భైంసా న్యాయస్థానంలో విచారణ జరగగా.. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి రెండు సంవత్సరాలు జైలు శిక్ష, రూ. వెయ్యి జరిమాన విధించినట్లు ఎస్సై తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ

వార్డు కమిటీ చైర్మన్ పదవికి రాజీనామా



మున్సిపల్ కమిషనర్‌కు రాజీనామా అందచేస్తున్న దృశ్యం

భైంసా, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిదిలోని 4 వవార్డు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కమిటీ చైర్మన్ చందులాల్ తన పదవి నుంచి తప్పుకున్నారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ కమిషనర్ రాజేష్‌కుమార్‌ను కలిసి రాజీనామా పత్రాన్ని అందచేశారు. వ్యక్తిగత కారణాల వల్ల తాను ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ వార్డు కమిటీ చైర్మన్ బాధ్యతలు నిర్వర్తించేందుకు సముఖతతో లేనని రాజీనామా పత్రంలో పేర్కొన్నారు. వెంటనే తనను పదవి నుంచి తప్పించాలని మున్సిపల్ కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు.

కొత్త సీఎస్‌ను కలిసిన లోక భూమారెడ్డి

● ఆదిలాబాద్ జిల్లాను గుర్తు చేసిన సీఎస్



సీఎస్ రామకృష్ణారావును సన్మానిస్తున్న విజయ డెయిరీ మాజీ చైర్మన్ లోక భూమారెడ్డి

తలమడుగు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శిగా నియమితులైన రామకృష్ణారావును బుధవారం విజయ డెయిరీ మాజీ చైర్మన్ తెలంగాణ ఉద్యమకారుడు లోకా భూమారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీఎస్ రామకృష్ణారావు మాట్లాడుతూ.. ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధిపై చర్చించారు. అందమైన అడవుల ఆదిలాబాద్ జిల్లాను ఎప్పటికీ మర్చిపోలేనని అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి పథకాలు అందరికీ అందే విధంగా చూడాలని కోరారు. అదేవిధంగా తలమడుగు మండలం రుయ్యాడి గ్రామ అభివృద్ధి గురించి లోక భూమారెడ్డి సీఎస్‌కు విన్నవించారు.

వివక్షను దూరం చేసిన మహాత్ముడు బసవేశ్వరుడు



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బసవేశ్వర జయంతి వేడుకలను నిర్వహిస్తున్న లింగాయత్ సంఘ సభ్యులు

బోథ్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): 20వ శతాబ్ది కాలంలోనే కుల వివక్ష లేకుండా మతవర్ణ విభేదాలను పారద్రోలిన గొప్ప మహనీయుడు మహాత్మా బసవేశ్వరుడని లింగాయత్ సంఘం నాయకులు వెండి సోమేశ్వర్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బసవేశ్వర జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగాయత్ కులస్తుల అభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఆయన చూపించిన మార్గంలో ప్రతి ఒక్కరు నడుచుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వికాస్ పార్టీ కేదరీనాథ్ మన్మధ క్రాంతి, సుమంత్, ప్రజ్వల్, విగ్నేష్, వేదాంత వివేకులు పాల్గొన్నారు.

'పది'లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రతిభ

ఇంద్రవెల్లి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): బుధవారం వెలువడిన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ చాటారు. మండల వ్యాప్తంగా 98.42 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు మండల ఎంఈవో రాథోడ్ మానుకుమార్ తెలిపారు. మండలంలోని ముత్నూర్ గ్రామంలోని గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థిని వై.ఐశ్వర్య 600లకు గాను 565 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచాడు.

మంత్రులను విమర్శించడం జోగు రామన్నకు తగదు

● కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆత్రంసుగుణ

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రుల పై విమర్శలు చేయడం మాజీ మంత్రి జోగురామన్నకు తగదని కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జీ ఆత్రంసుగుణ అన్నారు. బుధవారం ప్రజాసేవ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిల పై మాజీ మంత్రి జోగురామన్న చేసిన వ్యాఖ్యలను ఆమె ఖండించారు. మరోసారి సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేల పై అనవసరమైన వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదన్నారు. అటు తన సొంత నియోజక వర్గం ములుగును, ఇటు జిల్లా ఇన్‌చార్జీ మంత్రిగా ప్రజల సమస్యల పరిష్కారం కోసం పాటుపడుతుందన్నారు. వాళ్లను చర్చకు రమ్మనే ముందు నువ్వు మంత్రిగా ఉన్న సమయంలో ఏం చేశావని ప్రశ్నించారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల, ఇంటికో ఉద్యోగం హామీ ఎక్కడని నిలదీశారు. మాజీ మంత్రి మతిస్థిమితం కోల్పోయి మాట్లాడుతున్నాడని విమర్శించారు. తాము ఓడి పోయినా ప్రజల కోసం పనిచేస్తున్నామని ప్రజల మధ్యనే ఉంటున్నామన్నారు. ఇప్పటికైనా నోటిని అదుపులో ఉంచుకుని మాట్లాడాలని, మరోసారి ఇలా మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఇందులో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్ రావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మునిగెలవిఠల్, శ్రీలేఖ, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు మునిగెల నర్సింగ్, కొండూరి రవి,నాయకులు మొహమ్మద్‌రఫిక్, ఎంఏ ఖయ్యూమ్ తదితరులు పాల్గొన్నారు

సమ సమాజ స్థాపనకు కృషి చేసిన మహనీయుడు బసవేశ్వరుడు



బసవేశ్వరుడి చిత్రపటానికి పూలమాల వేస్తున్న కందిశ్రీనివాస్‌రెడ్డి

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): సమాజంలో కులవర్గ వర్ణ వివక్షను రూపుమాపడం కోసం కృషి చేసిన మహనీయుడు మహాత్మా బసవేశ్వరుడని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జీ కందిశ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం తన క్యాంపు కార్యాలయం ప్రజాసేవ భవన్ లో జరిగిన బసవేశ్వర 892వ జయంతి వేడుకల్లో పార్టీ శ్రేణులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ముందుగా బసవేశ్వరుడి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. ఈ సందర్భంగా కంది శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ సమాజంలో స్త్రీ పురుషులిద్దరు సమానమేనన్న భావనను ప్రజల్లో తీసుకువెళ్లి సమ సమాజ స్థాపనకు కృషి చేసిన మహ నీయుడు బసవేశ్వరుడని కొనియాడారు. ఇందు లో నాయకులు భూపెల్లిశ్రీధర్, నగేష్, గిమ్మ సంతోష్‌రావు, ఎంఏ షకీల్, రంగినేని శాంతన్ రావు, మునిగెలవిఠల్, బండారిసతీష్, రామ్‌కుమార్, సందనర్సింగ్, ఇజ్జగిరి సంజయ్ కుమార్, మునిగెలనర్సింగ్, బూర్ల శంకరయ్య, దొగ్గలి రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

మహాత్మా బసవేశ్వర చౌక్‌లో

మావల, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): కుల వ్యవస్థను వ్యతిరేకించి సమానత్వాన్ని ప్రబోధించిన అభ్యుదయవాది మహాత్మా బసవేశ్వర 892వ జయంతి సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని మహాత్మా బసవేశ్వరచౌక్‌లో తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమాజంలో ఉన్న అనేక మూఢాచారాలను పారద్రోలి కుల మత రహిత సమాజాన్ని నిర్మించడానికి కృషి చేసిన ప్రముఖ సంఘ సంస్కర్త శ్రీ బసవేశ్వర అని శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. వారి సేవ లను గుర్తు చేసుకుంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీమావల మండల అధ్యక్షులు ధర్మపురి చంద్రశేఖర్, మాజీ ఎంపీపీ అట్ల గోవర్ధన్‌రెడ్డి, నలిమెల నవీన్‌రెడ్డి, వెంకటేష్, జ్ఞానేశ్వర్, హక్కీ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేస్తున్న దృశ్యం

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : పేద బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం పనిచేస్తుందని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్ చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సీఎం ఆర్‌ఎఫ్ నిధి నుంచి వచ్చిన చెక్కులను ఆయన బుధవారం తన క్యాంపు కార్యా లయంలో లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎంఆర్‌ఎఫ్ కోసం తన క్యాంపు కార్యాల యంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశామన్నారు. ఇందులో నాయకులు భూపెల్లి శ్రీధర్, నగేష్, గిమ్మసంతోష్, ఎంఏ షకీల్, రంగినేని శాంతన్ రావు, మునిగెలవిఠల్, బండారి సతీష్, రామ్ కుమార్, సందనర్సింగ్, ఇజ్జగిరి సంజయ్‌కుమార్, మునిగెలనర్సింగ్, దొగ్గలి రాజేశ్వర్ తదితరులున్నారు.

ఇతర పార్టీని విమర్శించే ముందు చరిత్ర తెలుసుకోవాలి

కాంగ్రెస్ నాయకులు పాకిస్తాన్ వెళ్లాలి అన్న ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి ఖండించారు. బుధవారం తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉగ్రవాదానికి బలైంది తమ కాంగ్రెస్‌పార్టీ అని, ఇద్దరు కాంగ్రెస్ ప్రధానమంత్రులు ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీని పొట్టన బెట్టుకున్నది ఉగ్రవాదం కాదా అని గుర్తు చేశారు. ఇతర పార్టీని విమర్శించే ముందు ఒకసారి చరిత్ర తెలుసుకోవాలని పవన్ కల్యాణ్‌కు సూచించారు. దేశం కోసం ప్రాణాలను అర్పించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదన్నారు. అనంతరం ఏపీలోని సింహాచల అప్పన్న చందనోత్సవంలో మృతి చెందిన భక్తులకు నివాళులర్పించారు. ఘటనలో క్షతగాత్రులైన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అదే విధంగా ఇటీవల ఎల్కతుర్తిలో కోట్లు ఖర్చు పెట్టి బీఆర్‌ఎస్ సభ నిర్వహించారని ఆరోపించారు. కేసీఆర్ ప్రసంగంలో ఎక్కడ బీజేపీ ప్రస్తావన లేదని కేవలం కాంగ్రెస్ పార్టీని విమర్శించేందుకే అంత ఖర్చు పెట్టి సభను ఏర్పాటు చేశారన్నారు.

నేడే.. మే డే!

(5వ పేజీ తరువాయి...)

మే 1న మే డేగా జరుపుకోవడం చరిత్రపుటల్లో నిలిచిపోయింది.

మనదేశంలో ఇలా..

చికాగో కార్మిక ఉద్యమ ప్రకంపనలు ప్రపంచంలోని అన్ని దేశాలకు వ్యాపించాయి. మొదట 1923 సంవత్సరంలో మద్రాస్‌కు చెందిన సింగారు వేలు చెట్టియార్ అనే కార్మిక నేత ఆధ్వర్యంలో మనదేశంలో మొదటిసారి గా మే డే వేడుకలను నిర్వహించారు. అప్పటి నుంచి కార్మిక సంఘటిత ఉద్యమాల ఫలితంగానే గృహ, విద్య, వైద్య, వేతన, భద్రత, సంక్షేమ చట్టాలను ప్రభుత్వం రూపొందించి అమలు చేస్తుంది. అయినా పూర్తి స్థాయిలో కార్మిక చట్టాలు అమలుకు నోచుకోక పోవడంతో కార్మికులు అలుపెరుగని పోరాటాలు చేస్తూనే ఉన్నారు. మే డే రోజే కార్మికుల సంక్షేమంపై అదరగొట్టే ప్రసంగాలు చేసే నేతలు, అధికారులు.. ఆ తర్వాత అంతా మరిచి పోవడంతో కార్మికుల జీవితాల్లో వెలుగులు కనిపించడం లేదు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఉగ్రవాద దిష్టిబొమ్మ దహనం



ఉగ్రవాద దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : ఉగ్రవాదాన్ని కూకటి వేళ్లతో పెకిలించి ఉక్కుపాదంతో అణిచి వేయాలని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పహాల్గామ్‌లో ఉగ్రవాద దాడికి నిరసనగా బుధవారం తన క్యాంపు కార్యాలయం ఎదుట ఉగ్రవాద దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కంది శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా ప్రమాదమేనని దాన్ని పూర్తిగా అంతమొందించాలన్నారు. ఇందుకు కేంద్రం తీసుకునే చర్యలకు కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్ధతునిస్తుందని తమ అగ్రనేత రాహుల్‌గాంధీ చెప్పడాన్ని గుర్తు చేశారు. దాడిలో మృతి చెందిన వారికి నివాళులర్పించారు. ఇందులో డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు గుడిపెల్లి నగేష్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మసంతోష్‌రావు, ఎంఏ షకీల్, రంగినేని శాంతన్‌రావు, మునిగెల విఠల్, బండారి సతీష్, యెల్మెల్వార్ రామ్‌కుమార్, సంద నర్సింగ్, ఇజ్జగిరి సంజయ్‌యకుమార్, మునిగెలనర్సింగ్, దొగ్గలి రాజేశ్వర్, కొండూరిరవి తదితరులు న్నారు.

అర్హులైన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితా ప్రదర్శన



నేరడిగొండ, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్హులైన ఇందిరమ్మ లబ్ధిదారుల జాబితాను బుధవారం ఎంపీడీవో కార్యాలయాలలో ప్రదర్శించడం జరిగిందని ఎంపీడీవో రాజ్‌వీర్ అన్నారు. అర్హులైన లబ్ధిదారుల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులైన వారిని ఎంపిక చేయడం జరిగిందన్నారు. త్వరలోనే అర్హులైన లబ్దిదారులు ఇంటి నిర్మాణం పనులను చేపట్టాలన్నారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

ఖానాపూర్‌లో

ఎట్టకేలకు ధాన్యం కొనుగోలు ప్రారంభం

● మిల్లులకు తరలిన నిలిచిపోయిన లారీలు



ధాన్యం తూకం వేస్తున్న హమాలీలు

ఖానాపూర్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : ఖానాపూర్‌లోని మార్కెట్ యార్డు ఆవరణలో నిర్వహిస్తున్న పీఏసీఎస్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఎట్టకేలకు తిరిగి ధాన్యం కొనుగోళ్ళు ప్రారంభమయ్యాయి. రెండు రోజుల క్రితం వరకు బస్తా ధాన్యం వెంట అదనంగా కిలో ధాన్యం ఇవ్వాలని మిల్లర్లు పేచి పెట్టడంతో ఖానాపూర్‌లో ధాన్యం కొనుగోళ్ళు నిలిచిపోవడంతోత ఈ నెల 29న అన్నదాతకు మళ్ళీ తప్పని తిప్పలు అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. అదనపు ధాన్యం కోసం నిలిచిపోయిన లారీతో పాటు మరో రెండు లారీలను లోడింగ్ చేసి మిల్లులకు తరలించినట్లు నిర్వహకులు చెబుతున్నారు. కాగా బుధవారం సైతం కొనుగోలు కేంద్రంలో ధాన్యం తూకం వేశారు. మంగళ, బుధవారాల్లో మొత్తం 1759 బస్తాల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు సెంటర్ నిర్వహకులు తెలిపారు. ఇప్పటి వరకు 1308 ధాన్యాన్ని మిల్లులకు తరలించినట్లు నిర్వాహకులు తెలిపారు.

రువ్విలో ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన



ఆలయంలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే తదితరులు

ముథోల్, ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి) 30 : మండలంలోని రువ్వి గ్రామంలో బుధవారం గ్రామ దేవత కోనేరు పోచమ్మ, పోత లింగన్న విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది.ఈ సందర్భంగా వేదపండితులు ప్రాతఃకాల పూజ ,ప్రధాన దేవతా హవానం, న్యాసప్రకరణం,యంత్ర స్థాపన,మూర్తి ప్రతిష్టా,ప్రాణ ప్రతిష్టా, పూర్ణాహుతి, హారతి తదితర పూజలు చేశారు. ఈ సందర్భంగా ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ , ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, నాయకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తుల ఆధ్వర్యంలో లన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

పదో తరగతి పరీక్షల్లో సత్తాచాటిన విద్యార్థులు

తలమడుగు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్ష ఫలితాల్లో మండలంలోని తొమ్మిది జిల్లా పరిషత్ హైస్కూల్‌లో వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. మరో మూడు పాఠశాలల్లో 97 శాతం ఉత్తీర్ణత సాధించి సత్తా చాటారు. మండలంలోని 12 హైస్కూల్‌లకు గాను 408 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 405 విద్యార్థులు పాస్ అయ్యారని మండల విద్యాధికారి వెంకట్‌రావు తెలిపారు.

ఆదర్శవంతంగా కిసాన్‌సేవా సమితి సేవలు

●ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్



అంబలి పంపిణీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్

భైంసా, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కేంద్రమైన భైంసాలోని కిసాన్ సేవా సమితి అన్నదాతలు, వ్యవసాయ కూలీలకు మార్గదర్శకమైన రీతిలో ఆదర్శంగా సేవలు అందిస్తోందని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ కొనియాడారు. బుధవారం కిసాన్ గల్లీలోని రోకడ్ హనుమాన్ మందిర సమీపంలో కిసాన్ సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబలి పంపిణీ కేంద్రాన్ని ప్రారంభించిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గత అర్ధ దశాబ్ద కాలంగా కిసాన్ సేవా సమితి వేసవి కాలంలో అన్నదాతలు, వ్యవసాయ కూలీలకు అనిర్వచనీయమైన సేవలు అందిస్తోందని అభినందించారు. సమాజ సేవకు సమితి సభ్యులు బాధ్యాయుత భాగస్వామాన్ని అందిస్తున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కిసాన్‌గల్లి వాసులు పలు ప్రస్తావించిన పలు సమస్యల పరిష్కారానికి, అవసరమైన ప్రగతి పనుల కోసం అవసమైన నిధులు మంజూరి చేయిస్తానని వెల్లడించారు. కాలనీ పరిధిలో మున్నురుకాపు కళ్యాణ మండప నిర్మాణానికి బాధ్యతాయుతంగా తోడ్పాటునిస్తానని వెల్లడించారు. ఇందులో మున్సిపల్ మాజీ చైర్మెన్ బి. గంగాధర్, కిసాన్ సేవా సమితి అధ్యక్షులు అల్లకొండ సాయినాథ్, బీజేపీ భైంసా పట్టణ కమిటీ అధ్యక్షుడు ఎనుపోతుల మల్లేశ్వర్, హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు పెండెపు కాశీనాథ్, ఎంసీటీ చైర్మెన్ డా.నగేష్, లయన్స్ క్లబ్ ప్రతినిధి డా.ముత్యం రెడ్డి,తూమోల్ల సేవా సమితి అధ్యక్షులు తూమోల్ల దత్త్రాత్రి, బీజేపీ పట్టణ కమిటీ మాజీ అధ్యక్షుడు గాలి రవి, ప్రతినిధులు కాసరోళ్ల ప్రవీణ్ , బండారీ దిలీప్, కాలనీ , కిసాన్ సేవా సమితి ప్రతినిధులు కుంట రాజలింగు, కుంట కాశీనాథ్,కాండ్లీ సాయినాథ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

పది ఫలితాల్లో నిర్మల్ జిల్లాకు 15వ స్థానం

● దక్కని అగ్రస్థానం ● ఉత్తీర్ణత 96.70 శాతం ● బాలికలదే హవా 97.95శాతం



10 పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన నైనారెడ్డిని అభినందిస్తున్న అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పదవ తరగతి పరీక్ష ఫలితాలను సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం విడుదల చేశారు. గత రెండేళ్ళుగా రాష్ట్రంలోనే ఫలితాల సాధనలో ప్రథమ స్థానంలో నిలిచిన నిర్మల్ జిల్లా ఈ సారి 15వ స్థానానికి పరిమితమైంది. రాష్ట్ర ఉత్తీర్ణత శాతం 92.78 శాతం కాగా నిర్మల్ జిల్లా 96.70 శాతం సాధించింది. జిల్లాలో బాలుర కన్నా బాలికల ఉత్తీర్ణత శాతం ఎక్కువగా ఉంది. మొత్తం జిల్లా నుంచి 9123 మంది పరీక్షకు హాజరయ్యారు. 8822 మంది విద్యార్థులు ఉత్తీర్ణులై 96.70శాతం నమోదైంది. 4441 మంది బాలురుకు హాజరై 4261 మంది ఉత్తీర్ణులు కాగా 4682 మంది బాలికల్లో 4561 మంది బాలికలు ఉత్తీర్ణులైయ్యారు. బాలుర ఉత్తీర్ణత శాతం 95.95 శాతం బాలికలది 97.42 శాతంగా ఉంది.

10 కెజిబీవీ పాఠశాలల్లో వందశాతం ఉత్తీర్ణత

జిల్లాలోని 10 కెజీబీవీ పాఠశాలల్లో 10 పాఠశాలలు వందశాతం ఉత్తీర్ణత సాధించాయి. మొత్తం 98.59 శాతం ఉత్తీర్ణులయ్యారు. దస్తూరాబాద్, దిలావర్‌పూర్, కడెం, ఖానాపూర్, కుభీర్, లక్ష్మణచాంద, లోకేశ్వరం, మామడ, ముథోల్, నర్సాపూర్, పెంబి, సోన్, తానూర్ వందశాతం ఉత్తీర్ణత సాధించాయి. భైంసాలో 98. నిర్మల్ 88, నిర్మల్ రూరల్, సారంగాపూర్ 98, కుంటాల 95శాతం ఉత్తీర్ణత సాధించాయి. నిర్మల్ కెజీబీవీ ఫలితాల సాధనలో చివరి స్థానంలో నిలిచింది.

పది ఫలితాల్లో జిల్లా టాపర్‌కు అడిషనల్ కలెక్టర్ అభినందన

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : పదవ తరగతి ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించి జిల్లా టాపర్‌గా నిలిచిన నల్ల నైనా రెడ్డిని బుధవారం జిల్లా అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ హైమద్ తో పాటు జిల్లా విద్యాధికారి రామారావు తదితరులు అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం బుధవారం పదవ తరగతి పరీక్ష ఫలితాలను వెలువరించింది. కాగా పట్టణంలోని వాసవి ఒలంపియాడ్ పాఠశాలలో చదువుతున్న నైనా రెడ్డి 600 మార్కులకు గాను 589 మార్కుల సాధించింది. నిర్మల్ లోని ఏఎన్ రెడ్డి పదవ తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచడంతో ఆమెను పలువురు అభినందిస్తున్నారు.

యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో విద్యార్థికి సన్మానం



నార్నూర్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన షేక్ ముక్రం తనయుడు షేక్ సిర్హాన్ పదోతరగతి లో 519 మార్కులు సాధించినందుకు యువజన కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు షేక్ మొహమ్మద్ ఆధ్వర్యంలో ఘనంగా శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో యువత ఉన్నత స్థాయి తల్లిదండ్రుల ఆశలు నెరవేర్చలా పై చదవు విద్యాభ్యాసం చేసి మంచి ఉద్యోగాలు సాధించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ కో అప్షన్ మెంబర్ షేక్ దస్తగిర్, పాక్స్ డైరెక్టర్ కాంతరావుదుర్గే, ఆసిఫాబాద్ అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ షేక్ నసీర్ పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు జొన్న పంట దగ్ధం



దేగామలో దగ్ధమవుతున్న జొన్నపంట

ఇచ్చోడ/ బజార్‌హత్నూర్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దేగా మ గ్రామానికి చెందిన రైతులు కొడారి నరేష్, అంగ వినోద్, కొత్తకొండ శ్రీకాంత్‌లకు చెందిన 9 ఎకరాల జొన్నపంట వందకు పైగా స్ప్రింక్లర్ పైపులు ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతై జొన్న పంటతో పాటు కాలిపోయాయి. స్థానికులు, రైతులు తెలిపిన వివరాల ప్రకారం బుధవారం మధ్యాహ్నం సమ యంలో జొన్నపంటలో మంటలు చెలరేగడంతో రైతులందరూ సంఘటన స్థలానికి వెళ్లి ఆర్పే ప్రయత్నం చేసిన గాలికి చుట్టూ ఉన్న భూములలో జొన్న పంటపై మంటలు వ్యాప్తించాయి. అగ్నిమాపకశాఖకు ఎన్నిసార్లు ఫోన్లు చేసిన అగ్నిమాపక శాఖవాహనం రాకపోవడంతో పంట మొత్తం కాలి పోయిందని తెలిపారు. చేతికి వచ్చిన పంట అగ్నికి ఆహుతి కావడంతో రైతుల కళ్లలో కన్నీరు ఆగలేకపోయింది. ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలని స్థానికులు రైతులు కోరారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

సోన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ కృష్ణ ప్రసాద్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని గంజాల్ గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ బర్మ గంగాధాస్, డైరెక్టర్లు మధుకర్ రెడ్డి, రమేష్ రెడ్డి, రాజేశ్వర్, శ్రీనివాస్ రెడ్డి తదితరులున్నారు.

రోడ్లపై ధాన్యంతో ప్రమాదాలు : ఎస్సై సాయికిరణ్

నర్సాపూర్(జి), ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): రైతులు ఎక్కువగా ధాన్యాన్ని ఆయా గ్రామాలలో రోడ్లపై ఆరాబెట్టడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కోవడంతో పాటు ధాన్యం కుప్పలతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఎస్సై సాయికిరణ్ అన్నారు. రోడ్డుపై ధాన్యాన్ని ఆరాబెట్టవద్దని పోలీసులు ఎన్నిసార్లు రైతులకు అవగాహన కల్పించిన కొందరు రైతుల తీరు మారడం లేదు. రోడ్డుకు సగం వరకు ధాన్యాన్ని ఆరాబోయడంతో మండల వ్యాప్తంగా ప్రమాదాలు జరిగిన సంఘటనలు చాలానే ఉన్నాయన్నారు. రైతులు సహకరించి ఇకముందైన ధాన్యాన్ని కల్లాల్లో,ఖాళీ ప్రదేశాల్లో, కొనుగోలు కేంద్రాల వద్ద ఆరాబెట్టుకోవాలని పోలీసు అధికారులు కోరుతున్నారు.

'పది' ఫలితాల్లో విద్యార్థుల హవా

రాష్ట్ర ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన పదో తరగతి ఫలితాల్లో ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారు. పదో తరగతి ఫలితాలలో ఉత్త మ మార్కులు సాధించడంతో పాటు పలు పాఠశాలల్లో విద్యార్థు లు వంద శాతం ఫలితాలను సాధించారు.

ఆదర్శ పాఠశాల విద్యార్థుల హవా


జి.ఆకాష్


ఆర్.పవన్ కుమార్

నార్నూర్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు 10వ తరగతి ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించి సత్తా చాటారు. మొత్తం విద్యా ర్థులు 72 కాగా బాలురు 54, బాలికలు 18 మంది ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించి విజయకేతనం ఎగర వేశారు. ఆదర్శ పాఠశాలకు చెందిన విద్యార్థి జి.ఆకాష్ 600 మార్కులకు 548 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచాడు. రాథోడ్ పవన్ 600 మార్కులకు గాను 538 మార్కులు సాధించి రెండవ స్థానంలో నిలిచారు.12 మంది విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించారు. ఈ సందర్భంగా ఆదర్శ పాఠశాల ప్రధానో పాధ్యాయులు ఎం.ప్రశాంత్ మాట్లాడుతూ పదో తర గతిలో పాఠశాల విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సా ధించడంతో పాటు మండల టాపర్ గా నిలవడం పాఠ శాలకు గర్వకారణమని అన్నారు. ఏజెన్సీ ప్రాంతంలోని నిరుపేద కుటుంబానికి చెందిన విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసిస్తూ.. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ఫలితాలను సాధిస్తున్నారన్నారు. కృషి పట్టుదల ఉంటే లక్ష్యాన్ని సులువుగా సాధించగలమన్నారు. విద్యా ర్థుల విజయం వెనుక ఉపాధ్యా యుల విశేష కృషి ఉం దని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయ బృం దం నేడు విడుదలయిన ఫలి తాల్లో సత్తా చాటిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఆదిలాబాద్

గురుకుల విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత


బి.సలోని (576) ఏ.వాత్సల్య (569) ఎం.కావ్యశ్రీ(564) హరిచందన(563) నలిని (561)


వైష్ణవి (561)

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్ష ఫలితాల్లో గురుకుల విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించారని పిన్సిపల్ ఎం.లలిత కుమారి ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి వార్షిక పరీక్ష ఫలితాల్లో 75 మంది విద్యార్థులు పరీక్షా రాయగా 75 మంది విద్యార్థులు ఉత్తీర్ణతలు సాధించారన్నారు. 11 మంది విద్యార్థులు 550 కి పైగా 36 మంది 500 పైగా మార్కులు సాధించాలన్నారు. ప్రథమ స్థానంలో బి.సలోని (576), ద్వితీయ స్థానంలో ఏ.వాత్సల్య (569), తృతీయ స్థానం లో ఎం.కావ్యశ్రీ(564)మార్కులుతో సాధించారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థినులను ప్రిన్సిపల్, సిబ్బంది అభినందించారు.



పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

ఎస్ఆర్ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం బుధవారం 2024- 25 విద్యా సంవత్సరం 10వ తరగతి ఫలితాల్లో ఎస్ఆర్ విద్యార్థులు తమ ప్రతిభతో.. యు.వేదిక 581, కె.అక్షరం 578, డి.చందన 578, జి.నక్షత్ర 575, సిహెచ్ దీపిక 574, జి.రామ్ చరణ్ 573, డి.రేవంత్ శర్మ 570, ఎం.మనమిత 569, బి.వంశీకృష్ణ 568, లక్ష్మీ నరసింహ 567, బి.సాహితీ 566 మార్కులు సాధించారు. పదో తరగతిలో ఎక్కువ మార్కులు సాధించిన విద్యా ర్థులకు పాఠశాల యాజమాన్యం తరఫున జోనల్ శ్రీని వాస్ రెడ్డి అభినందించారు. ఎస్ఆర్ పాఠశాలలు 100 శాతం ఉత్తీర్ణత సాధించిన ఎస్ఆర్ పాఠశాలను ప్రశం సించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ వరద రెడ్డి, డైరెక్టర్ సంతోష్ రెడ్డి, డీన్ దేవదాస్, ప్రిన్సిపల్ సరితా, రవి పాల్గొన్నారు.

భైంసాలో ఐదు పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత

భైంసా, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): భైంసా పట్టణ, మండల పరిధిలోని 5 ప్రభుత్వ పాఠశాలలు పది ఫలితాల్లో శతశాతం ఉత్తీర్ణత నమోదు చే సుకున్నాయి. మండల పరిధిలో 9 ఉన్నత పాఠశాలలు ఉండగా కామో ల్, చుచుంద్, దేగాం ఉన్నత పాఠశాలు , పట్టణ పరిధిలో 7 ఉన్నత పాఠ శాలలు ఉండగా మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ (బాలురు), సోషల్ వెల్ఫే ర్ రెసిడెన్షియల్ స్కూల్ (బాలికలు) శతశాతం సాధించాయి. ఇక్కడి పా ఠశాలల్లో మొత్తం 647 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు రాయ గా ఇందులో నుంచి 93.20 శాతంతో 603 మంది విద్యార్థులు ఉత్తీర్ణుల య్యారు. జడ్పీహెచ్ఎస్ మహాగాం పాఠశాలకు చెందిన ఏ. ప్రణయ 556 మార్కులతో మండల టాపర్‌గా, మాటేగాం ఉన్నత పాఠశాలకు చెం దిన శ్రీజ 555 రెండవ టాపర్‌గా నిలిచింది. పట్టణ పరిధిలో సోషల్ వెల్ఫే ర్ రెసిడెన్షియల్ స్కూల్ (బాలికలు) కు చెందిన పి. శ్వేత 583 టాపర్‌గా నిలువగా మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ (బాలురు)కు చెందిన బాగాజీ 553 రెండవ టాపర్‌గా నిలిచాడు. ఇక వానల్‌పాడ్ పాఠశాల అ త్యల్పం గా కేవలం 37.5 శాతం ఉత్తీర్ణత సాధించింది. మిగతా పాఠశాలల ఉత్తీర్ణ త పరిశీలిస్తే మాటేగాం 93.33 శాతం, తిమ్మాపూర్ 53.85 శాతం, కోతల్ గావ్ 87.5 శాతం, మిర్జాపూర్ 84 శాతం, మహాగాం 96.43 శాతం, ఏపీన గర్ 94.12 శాతం, కిసాన్‌గల్లీ 96.30 శాతం, జీహెచ్ఎస్ 90 శాతం, ఏహె చ్ఎస్ 97.18 శాతం, కేజీబీవీ 97.87 శాతం ఉత్తీర్ణత సాధించారు.

కుంటాలలో..

కుంటాల: మండ లానికి చెందిన పలు ప్రభుత్వ పా ఠశాలల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. కుంటాల జి ల్లా పరిషత్ హైస్కూల్‌తో పాటు ఓలా ఉర్దూ మీడి యం హైస్కూల్, కుంటాల ఆదర్శ మోడల్ పాఠశాలలో 100 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఓలా తె లుగు మీడియం హైస్కూల్‌లో 92 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. అంతేగాకుండా కల్లూరు కస్తుర్బా పాఠశాలలో 95 శాతం, లింబా(కే) హైస్కూల్‌లో 87 శాతం, కల్లూర్ హైస్కూల్‌లో 72 శాతం విద్యార్థులు ఉత్తీ ర్ణత సాధించారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించిన కేజీబీవీ విద్యార్థులు

నర్సాపూర్(జి): పదో తరగతి పరీక్ష ఫలితాల్లో నర్సాపూర్ కేజీబీవి విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రత్యేకాధికారి వీణ తెలి పారు. పాఠశాలలో 41 మంది విద్యార్థినులు ఉండగా అందరు పాసైనట్లు తెలిపారు.

భీంపూర్ మండల టాపర్‌గా పిప్పల్‌కోటి విద్యార్థులు


రెండ్ల సంజన, పిప్పల్‌కోటి పాఠశాల రోడ్డ శిరీషా, పిప్పల్‌కోటి పాఠశాల

భీంపూర్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అం దర్‌బంద్ పరీక్ష కేంద్రంలో 170 మంది విద్యార్థులు ప రీక్షలు రాయగా 169 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మండల ఉత్తీర్ణత శాతం 99.41 కాగా పిప్పల్ కోటి జడ్పీఎస్ఎస్ విద్యార్థులు రెండ్ల సంజన, దొడ్డ శిరీషాలు 558 మార్కులు సాధించి మండల టాపర్‌లుగా నిలిచారు. ఇదే పాఠశాలకు చెందిన విద్యార్థులు గౌరీషా, శ్రీజలు 554 మార్కులు సాధించి మండల సెకండ్ టాపర్‌లుగా నిలిచారు. మండల టాపర్లుగా నిలిచిన రొడ్డ శిరీషా తండ్రి పారిశుధ్య కార్మికుడు కాగా రెండ్ల సంజన తల్లిదండ్రులు రెండ్ల అనిత జనార్ధన్‌లు వ్యవసాయం చేస్తారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఎంఈవో శ్యామ్‌సుందర్ అభినందించారు.

పది పరీక్షలో మండల టాపర్‌గా శశికాంత్



తానూర్ , ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం బుధవారం ప్రకటించిన పదోతరగతి ఫలితాల్లో మండలంలోని భోసి గ్రామ ఉన్నత పాఠశాలకు చెందిన శశికాంత్ 544 మార్కులతో మండ ల టాపర్‌గా నిలిచినట్లు ఎంఈవో నరేందర్ తెలిపారు. అదే వి ధంగా పాఠశాలకు చెందిన గాయత్రి 543 మార్కులతో ద్వితియ స్థానం, అదే విధంగా ఎల్వీ పాఠశాలకు చెందిన అఖిల 540 మాయ్కులతో తృతీయ స్థానంలో నిలిచిందన్నారు.

'పది' ఫలితాల్లో మెరిసిన ముధోల్ విద్యార్థులు

● 12 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత


ఉమా మహేశ్వరి 579 మార్కులు | శివకీర్తి 581 మార్కులు | కిరణ్మయి 574 మార్కులు | ప్రవీణ్ 568 మార్కులు

ముథోల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో ముథోల్ మండ లంలోని 6 ప్రభుత్వ పాఠశాలలు, ఆశ్ర మ ఉన్నత పాఠశాల, కస్తూర్బా గాంధీ, 4 ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించగా చిం చాల ఉన్నత పాఠశాల 75 శాతం ఉత్తీ ర్ణత సాధించి మంచి ప్రతిభ కనబరి చారు. మండలంలోని ఎడ్‌బిడ్, మచ్క ల్, బోరిగాం, ఆష్టా, ప్రభుత్వ పాఠశాల లు, ముథోల్ తెలుగు మీడియం బాలి కల పాఠశాల, ఉర్దూ మీడియం బాలికల పాఠశాల, వందశాతం ఉ త్తీర్ణత సాధించాయి. అలాగే ఆశ్రమ, కస్తూరిబా, గురుకుల బాలుర పాఠ శాల, ట్రైబల్ వెల్ఫర్ బాలికల పాఠశాల, జ్యోతిబా పూలే పాఠశాల, మై నార్టీ బాలికల పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు సంబం ధిత ప్రధానోపాధ్యాయులు తెలిపారు. అలాగే రబీంద్ర ఉన్నత పాఠశాల వందశాతం, శిశు మంధీర్ పాఠశాల వంద శాతం ఉత్తీర్ణత సాధించాయి. బోరిగాం పాఠశాలలో బ్యాగరి హర్షిక 545 మార్కులు, ఆష్టా పాఠశాల లో రాజేష్ 549 మార్కులు, గురుకుల పాఠశాలలో వై.ప్రవీణ్ 568 మార్కులు సాధించారు. అలాగే గిరిజన బాలికల పాఠశాలలో ఏ, కిర ణ్మయి 574 మార్కులు, జ్యోతి బాపూలే బాలికల పాఠశాలలో శివకీర్తి 581 మార్కులు, కస్తూర్బా పాఠశాలలో అశ్విత 563 మార్కులు, మైనార్టీ బాలికల పాఠశాలలో ముస్కాన్ 560 మార్కులు, బాలికల తెలుగు మీ డియం పాఠశాలలో కీర్తన 552 మార్కులు. రబీంద్ర పాఠశాలలో ఉమా మహేశ్వరీ 579 మార్కులు, శిశు మందిర్ పాఠశాలలో వినయశ్రీ 556 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉపాధ్యాయులు, పోషకులు అభినందించారు.


మండలంలో టాపర్లుగా నిలిచిన టి.రిషిక, తన్విక

సత్తా చాటిన గురుకులం విద్యార్థులు

బోథ్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మండ లంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠ శాల విద్యార్థులు పదవ తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించడం జ రిగింది. పాఠశాల నుంచి పదో తరగతి పరీక్షలు రాసిన వారిలో పి.తన్విత, టి.రిషిక 600 మార్కులకు గాను 575 మార్కులు సాధించి మండలంలో టాపర్లుగా నిలిచారు. వీరితో పాటు సీహెచ్ వర్ష 568, కె.సంజన 567, సీహెచ్ స్పందన, డి.అంజలి 600 మార్కులకు గా ను 566 మార్కులు సాధించి జిల్లాలో పాఠశాల పేరు నిలిపారని ప్రిన్సిపాల్ సంగీత విద్యార్థులను అభినం దించింది. 11 సంవత్సరాలుగా కళాశాల మొదటి స్థానం లో నిలుస్తూ సంపాదించారు.

నేరడిగొండ మండల విద్యార్థుల ప్రభంజనం


ఏ.ఆర్తిక, కేజీబీవీ, నేరడిగొండ టాపర్ సీహెచ్ ఆర్తి 559/600 (సెకండ్)

నేరడిగొండ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): బుధవారం విడుద లైన పదో తరగతి ఫలితాల్లో మండలంలో పది పాఠశాలలు ఉండగా వాటిల్లో ఎనిమిది పాఠ శాలల్లో వంద శాతం, రెండు పాఠశాలల్లో 96 శాతం విద్యా ర్థులు ఉత్తీర్ణులయ్యారు. జడ్పీ హెచ్ఎస్ తేజా పూర్, జడ్పీ హెచ్ఎస్ వాంకిడి జడ్పీహెచ్ ఎస్ కుమారి, ఏఎస్ఎస్ లఖంపూర్, ఏహెచ్ఎస్ కుంటాల, ఏహెచ్ఎస్ కొరిటికల్, కేజీబీవీ నేరడిగొండ టీజీయూ ఆర్‌జేతఈ బుగ్గరం, పాఠశాల విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణులవగా జడ్పీహెచ్ఎస్ నేరడిగొండ, జడ్పీహెచ్ ఎస్ వడూర్‌లో మాత్రం 96 శాతం విద్యార్థులు ఉత్తీ ర్ణులయ్యారని ఎంఈవో భూమారెడ్డి తెలిపారు. మండల టాపర్లుగా కేజీబీవీ నేరడిగొండ బి.ఆర్తిక 600ల మార్కులకు గాను 564 మార్కులు సాధించగా టీజీ టీడబ్ల్యూ యూఆర్‌జేసీ (బాలికల) బుగ్గరాం సీహెచ్ ఆర్తి 600 వందలకు గాను 559 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచారు. వీరి ధ్దరినీ మండల వాసులు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.


నార్నూర్ అంబేద్కర్ విగ్రహానికి దగ్గరలో ఇంకుడు గుంత

ఇంకుడు గుంతపై గ్రామస్థుల అభ్యంతరాలు

నార్నూర్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ అధికారులు మండలకేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి దగ్గర ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతపై చుట్టూ పక్కల ప్రజలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. రెండు వైపులా రోడ్ మధ్యలో ప్రమాదకరంగా ఇంకుడు గుంత తవ్వినందుకు నిత్యం చిన్న పిల్లలు ఆడుతు ఉంటారు. రాకపోకలు చేస్తూ ఉంటారు. ప్రమాదం జరిగితే దానికి బాధ్యులు ఎవరని ఆందోళన చెందుతున్నారు. పైగా మొత్తానికి మురికి నిండి ఉండడం దోమలు బెడద ఎక్కువగా ఉన్నది. ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి సమస్య పరిష్కారం చేయాలంటు గ్రామస్తులు చాలుర్కర్ ప్రకాష్, కొలేత్కేర్ భారత్ సురేందర్ డిమాండ్ చేశారు.

స్వర్ణవాగు నుంచి యథేచ్ఛగా ఇసుక రవాణా

● చోద్యం చూస్తున్న అధికారులు



నంబర్ ప్లేట్లు లేని ఇసుక ట్రాక్టర్

నిర్మల్‌రూరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : స్వర్ణ వాగు పరివా హక ప్రాంతాలైన మండలంలోని చిట్యాల, వెంగ్వాపేట్, తల్వేద, తాంశ గ్రామా ల నుంచి యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా సాగుతుంది. ప్రధాన రహ దారి పక్కనే ఉన్న చిట్యాల బ్రిడ్జి సమీపంలో గల వాగు నుంచి యథే చ్ఛగా ఇసుకను తరలిస్తున్న అడ్డుకు నేందుకు అధికారులు సాహసించకపోవడంతో ఇసుకాసురులకు అ డ్డు లేకుండాపోయిందని మండల ప్రజల నుంచి విమర్శలు వెళ్ళువె త్తుతున్నాయి. ఇసుకాసురులు ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ అక్రమార్జనే ధ్యేయంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఇల్లు నిర్మించుకునే సామాన్యునికి ఇసుక దొరుకుతుందో లేదో కానీ కాంట్రాక్టర్లు చేపట్టే పనులకు క్షణాల్లో ఇసుక చేరుతుందనడంలో అతిశయోక్తి లేదు. ఇప్పటికే మండలంలో ఇసుకను తరలిస్తూ వాగుల ఆనవాళ్ళు లేకుం డా చేసిన ఇసుకాసురులు ఇసుకను తోడేస్తున్నారు. ఇసుకాసురులు నంబర్ ప్లేట్లు లేని వాహనాల్లో ఇసుకను తరలిస్తున్నారు. నెంబర్ ప్లేట్లు కూడా లేని ట్రాక్టర్‌లలో ఇసుక అక్రమ రవాణా చేస్తున్న కనీసం మందలించే నాథుడే లేడని మండల ప్రజలు సంబంధిత అధికారులపై విమర్శల వర్షం కురిపిస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు ఇసుక అక్రమ రవాణాపై స్పందించకుంటే వాగులు కను మరుగై భూగర్భ జలాలు అడుగంటిపోయే ప్రమాదం ఉందని పలు వురు పేర్కొంటున్నారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని అధికారు లు ఇసుకాసురులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

విద్యుత్ సరఫరా అంతరాయాల నివారణకు కొత్త పరికరాల బిగింపు

భైంసా, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో అంతరాయల నివారణకు గాను అధికారులు అధునాతన బ్రేక ర్ పరికరాన్ని బిగించారు. మంగళవారం ఉదయం వేళలో విద్యుత్ సర ఫరా నిలిపి వేసిన అధికారులు అంతరాయల నివారణ కోసం ప్రత్యేక చర్యలు చేపట్టారు. సబ్ స్టేషన్‌కు పూర్తి స్థాయి మరమ్మత్తులు నిర్వహిం చారు. దెబ్బతిన్న పరికరాల స్థానంలో కొత్త వాటిని బిగించారు. ప్రధా నంగా మాన్యువల్ బ్రేకర్ కారణంగా తరచూ సరఫరాలో అంతరాయలో చోటు చేసుకుంటుండటంతో సమస్యను శాశ్వతంగా పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగానే సబ్ స్టేషన్‌కు అధునాతనమైన బ్రేకర్‌ను బిగించారు. తద్వారా సరఫరాలో అంతరాయల నివారించబడు తాయని భైంసా సబ్ స్టేషన్ అధికారులు వెల్లడించారు.


బ్రేకర్ బిగిస్తున్న విద్యుత్ అధికారులు

ఘనంగా అక్షయ తృతీయ వేడుకలు


భైంసాలో విత్తనాలు కొనుగోలు చేస్తున్న రైతులు


పెంచికల్‌పాడ్ గ్రామంలో అక్షయ తృతీయలో పాల్గొన్న గ్రామస్థులు

● ఖరీఫ్ పనులకు శ్రీకారం చుట్టిన అన్నదాతలు

భైంసా, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలో బుధవారం అక్ష య తృతీయ పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. అన్నదాతలు ఆన వాయితీ ప్రకారం పర్వదినాన్ని పురస్కరించుకొని వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టారు. ఇక్కడి మార్కెట్‌కు తరలివచ్చి విత్తనాలను కొను గో లు చేశారు. ప్రతి కూల పరిస్థితుల మూలంగా విత్తనాల అవసరం ఎం తో ఉన్నప్పటికీ ఒకటి, రెండు ప్యాకెట్లను కొనుగోలు చేశారు. పలు ప్రాం తాలకు చెందిన అన్నదాతలు ఏరువాక పనులకు శ్రీకారం చుట్టారు. వేకు వజామున వ్యవసాయ భూములకు కొత్త అరకలు, అంబలి కుండలు, భోజన వంటకాలతో వెళ్లి భూమిపూజ, బసవన్నలకు పూజలు చేసి పను లను ప్రారంభించారు. అనంతరం కుటుంబ సమేతంగా భోజనాలు చేసి తిరిగివచ్చారు. ఇన్నాళ్ల వరకు గాంధీ గంజ్ మార్కెట్లో వెలవెలబోయి వి త్తన విక్రయ కేంద్రాలు రైతుల కొనుగోళ్లతో కళకళలాడాయి. ఇక బంగారు దుకాణాలు, ద్విచక్ర వాహనాల షో రూమ్‌లలో సైతం కొనుగోళ్లు ఆశా జనకంగా కొనసాగాయి. వివిధ ప్రాంతాల్లోని స్వాధ్యాయి పరి వార్ సభ్యు లు అక్షత తృతీయను పురస్కరించుకొని యోగేశ్వర కృషి క్షేత్రాల్లో సా మూహికంగా ప్రత్యేక పూజలు నిర్వహించి వ్యవసాయ పనులను ప్రా రంభించారు.

ముథోల్: మండల కేంద్రమైన ముథోల్‌తో పాటు మండలంలోని ఆ యా గ్రామాల్లో బుధవారం ప్రజలు అక్షయ తృతీయ వేడుకలను ఘనం గా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూ జలు నిర్వహించారు. మరి కొందరు శుభ దినం కావడంతో నూతన గృ హ నిర్మాణాలకు భూమిపూజ చేశారు. మరి కొందరు రైతులు పంట పొలాల్లో భూమి పూజ చేశారు. స్వాధ్యాయ పరివారం మండలంలోని ఆ యా గ్రామాల్లో గల యోగేశ్వర్ కృషిలో భూమి పూజ చేశారు. అలాగే మరి కొందరు వారి స్థోమతను బట్టి వెండి, బంగారం కునుగోలు చేశా రు. ఈ సందర్భంగా ఒకరినొకరు పండుగ శుభకాంక్షాలు తెలుపుకు న్నారు.

కుంటాల: కుంటాల మండలంలోని పెంచికల్‌పాడ్ తదితర గ్రామా లలో బుధవారం అక్షయ తృతీయ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సం దర్భంగా స్వాధ్యాయ భక్తులు గ్రామంలో ప్రధాన వీధుల గుండా ఊరే గింపుగా వెళ్లి వ్యవసాయ భూముల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూతన వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో మహిళలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


మండే ఎండల్లో విద్యార్థుల అడ్మిషన్ల కోసం పల్లె బాట పట్టిన ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు

అడ్మిషన్స్ కోసం ప్రైవేటు ఉపాధ్యాయుల అగచాట్లు

బోథ్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మండే ఎండ నుండి ప్రజలు రక్షించు కోవాలని ఎండల్లో తిరిగితే ప్రమాదాలు పొంచి ఉంటాయని వాతావరణ శాఖ వారు పేర్కొంటున్నారు. అంతేగాక అదిలాబాద్ జిల్లాలో రెడ్ అలర్ట్ ప్రకటిం చారు. అయితే జూన్ మాసానికి మొదలుగానే ఉపాధ్యాయులు ప్రైవేట్ పాఠ శాలల్లో విద్యార్థులను చేర్పించేందుకు పాటుపడుతున్నారు. పాఠశాలలకు సెల వులు ప్రకటించిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు మాత్రం అందులో పని చేసే ఉపాధ్యాయులకు సగం వేతనం ఇచ్చి గ్రామాల్లో దింపుతూ విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించే విధంగా కృషి చేయాలని పేర్కొన్నారు. దీంతో ఉపాధ్యా యులు తప్పనిసరి పరిస్థితుల్లో మహిళా ఉద్యోగులు ఇంటింటికి తిరుగుతూ విద్యార్థులను తమ తమ పాఠశాలలో చేర్పిస్తున్నారు. ఏది ఏమైనా ఉదయం పూట ప్రైవేట్ విత్తన కంపెనీల వారు విత్తనాల కంపెనీల తరఫున ప్రచారానికి వస్తుండడంతో మధ్యాహ్నం మండుటెండర్లు ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయులు వస్తున్నారు. మొత్తమ్మీద పల్లెల్లో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు విత్తన కంపెనీలతో పాటు పోటీపడి ప్రచారం చేస్తున్నారు.

రేండ్లపల్లిలో రోడ్డుకు అడ్డంగా విద్యుత్ స్తంభాలు



బోథ్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారుమూల గిరిజన గ్రామమైన రేండ్లపల్లిలో నడి రోడ్డుపై విద్యుత్ స్తంభాలు ఉండడంతో ఈ రోడ్డుపైన రేండ్లపల్లి కొత్తపల్లి గ్రామా ల ప్రజలు తీవ్ర ఇబ్బం దులకు గురి అవుతున్నా రు. గత 15 సంవత్సరాల క్రితం చేసిన స్తంభాలు రోడ్డు వెడల్పు కారణంగా రోడ్డు మధ్యలోకి మారాయని ఆయా గ్రామాల గిరిజనులు వాపోతున్నారు. అధికారులు రోడ్లకు అడ్డంగా ఉన్న స్తంభాలను తొలగించాలని కోరుతున్నారు. ఈ విషయంలో జిల్లా అధికారులు చర్యలు చేపట్టాలని, లేకుంటే భవిష్యత్తులో ఉత్తమ గ్రామాలకు ఇబ్బందులు తప్పవని వాపోతున్నారు.

- జిల్లాలో తరతరాలుగా హక్కుల కోసం గళమెత్తుతున్న కార్మిక లోకం
- మూతబడిన పరిశ్రమల పునరుద్ధరణకు కార్మికుల డిమాండ్
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై నిరంతర పోరాటాలు
- నేడు 139వ అంతర్జాతీయ కార్మిక దినోత్సవం

నేడే.. మే డే!



ఆదిలాబాద్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): శ్రమ జీవుల హక్కుల కోసం పోరాడిన అమర వీరులారా.. అందుకోండి అరుణారుణ వందనాలు.. అంటూ కార్మిక లోకం గళమెత్తే రోజు రానే వచ్చింది. కార్మికులు జరుపుకునే అంతర్జాతీయ కార్మిక సంఘీభావ దినోత్సవమే మే డే. ధనార్జనే ధ్యేయంగా రోజుకు 16 గంటల నుంచి 20 గంటల వరకు శ్రమదోపిడీని వ్యతిరేకిస్తూ చేసిన పోరాటాల ఫలితంగానే మే డేను జరుపుకుంటున్నారు. కార్మిక లోకం సంఘటితమైతేనే హక్కుల సాధన సాధ్యమని గుర్తెరిగిన శ్రామికులు తిరుగుబాటు పోరాటాలకు సిద్ధమయ్యారు. నిత్యం 8 గంటల పని 8 గంటల విశ్రాంతి, 8 గంటల వినోదం అనే నినాదంతో కార్మికులు ముందుకు సాగుతున్నారు. జిల్లాలో ఉన్న వ్యవసాయ ఆధారిత పరిశ్రమలతో పాటు సీసీఐ పరిశ్రమను పునరుద్ధరించాలని కార్మికులు తరతరాలుగా పోరాటం చేస్తూ వస్తున్నారు. గతంలో ఘనమైన చరిత్ర ఉన్న జిల్లా పరిశ్రమలు నేడు మూతపడి పోవడంతో కార్మికులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. అలాగే కాంట్రాక్టు ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆందోళన బాట పడుతున్నారు. ఆర్టీసీ, అంగన్‌వాడీ, భవన నిర్మాణ కార్మికులు, ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజన, దినసరి కూలీలు, కార్మిక చట్టం ప్రకారం పనికి తగ్గవేతనం అందించాలని కోరుతున్నారు. కార్మికుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న వ్యతిరేక విధానాలపై నిరంతర పోరాటాలు చేస్తున్నారు. మే డే అంటే కేవలం అమర వీరులకు నివాళులర్పించడం కాదని జాతి, కుల, మత, ప్రాంతీయ బేధాలతో కార్మికులను విడదీయుటకు ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలను వ్యతిరేకించి తిప్పికొట్టాలని కార్మిక సంఘాలు పిలుపునిస్తున్నాయి. సమైక్యత హక్కుల సాధనకు స్ఫూర్తినిచ్చే 139వ కార్మిక పర్వదినం మే డేను గురువారం జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించుకునేందుకు కార్మికులు సిద్ధమవుతున్నారు. ఇందులో భాగంగానే జిల్లాకేంద్రంతో పాటు మండల కేంద్రాలలోని ప్రధాన కూడళ్లను ఎర్ర జెండాలతో ముస్తాబు చేస్తున్నారు.


ఎండలో తోపుడు బండిని లాగుతున్న కార్మికుడు

ఇదీ నేపథ్యం..

క్రీ.శ. 1886 సంవత్సరంలో మే 1న అమెరికాలోని చికాగో నగరంలో పరిమితమైన పనిదినాలను కోరుతూ లక్షలాది మంది కార్మికులు సమ్మెకు దిగారు. ఈ సమ్మెను చెదరగొట్టేందుకు పోలీసులు కార్మికులపై అకారణంగా, విచక్షణ రహితంగా కాల్పులు జరిపారు. అయినా సరే కార్మికులు ధిక్కార స్వరాన్నే వినిపించారు. దీంతో సభా ప్రాంగణం రక్తసిక్తమైంది. కార్మికుల ఆర్తనాధాలతో చికాగో నగరం దద్దరిల్లింది. ఈ సంఘటనకు కారకులుగా చూపుతూ కొందరు కార్మికుల నేతలను పోలీసులు దారుణంగా ఉరి తీశారు. ఉరి తీసినంత మాత్రాన కార్మిక ఉద్యమం ఆగిపోదంటూ ప్రపంచ కార్మికులారా ఏకం కండి అనే నినాదంతో ముందుకు సాగుతున్నారు. అప్పటి నుంచి చికాగో అమరవీరుల సంస్మరణ దినాన్ని

(తరువాయి 6వ పేజీలో...)

మూసివేసిన పరిశ్రమలను తెరిపించాలి

: ఎస్.విలాస్, సీపీఐ జిల్లా కార్యదర్శి, ఆదిలాబాద్



జిల్లాలో మూసివేసిన పరిశ్రమలను భేషరతుగా తెరిపించి కార్మికులకు, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలి. ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలి. అదే విధంగా కాంట్రాక్ట్ కార్మికుల శ్రమ దోపిడికి గురవుతున్నారు. వారికి పీఎఫ్, ఈఎస్ఐ ఉచితంగా అమలు పరిచేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. ఒక నెలలో నాలుగు, సంవత్సరానికి 15 లీవ్‌లు ఇవ్వాలి. ప్రభుత్వాలు మారిన కార్మిక సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు.

కార్మికులకు సామాజిక భద్రత కల్పించాలి

: మల్లేష్, సీఐటీయూసీ, జిల్లా ప్రధాన కార్యదర్శి



దేశంలో అసంఘటిత రంగంలో పని చేస్తున్న కార్మికులందరూ దోపిడీకి గురవుతున్నా.. మరోపక్క కేంద్ర ప్రభుత్వం కార్మికులకున్న 15 రకాల చట్టాలను కలిపి నాలుగు చట్టాలుగా మార్చే ప్రయత్నం మానుకోవాలి. ముఖ్యంగా సుప్రీ కోర్టు ఆదేశాల మేరకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయడంతో పాటు కార్మికులకు సామాజిక భద్రత చట్టాన్ని చట్టం చేసి వారికి భద్రత కల్పించాలి.

పనికి తగ్గ వేతనాలు చెల్లించాలి

: బాలూరి గోవర్ధన్‌రెడ్డి, రైతు సంఘం నేత, ఆదిలాబాద్



కార్మికులకు పనికి తగ్గ వేతనం, కూలిని చెల్లించాలి. కార్మికులకు మేలు జరిగేవిధంగా అధికారులు చట్టాలను కచ్చితంగా అమలు చేయాలి. కార్మికులు దేశవ్యాప్త సమ్మెలు చేస్తున్నప్పటికీ వారిని ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వాలు ఎలాంటి ప్రయత్నాలు చేయడం లేదు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో 12 గంటల పాటు పని చేస్తున్నా.. కార్మికులకు చాలీచాలని వేతనాలు చెల్లిస్తున్నారు 8గంటల పని మరో 8 గంటల విశ్రాంతి, మిగితా 8 గంటల వినోదం అందేవిధంగా చర్యలు తీసుకోవాలి. కార్మిక శాఖ అధికారులు కార్మికుల సమస్యలపై ప్రత్యేకదృష్టిని సారించాలి.


లోడింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఉట్నూర్ సబ్ కలెక్టర్


హమాలీల లైసెన్స్‌లను పరిశీలిస్తూ..

హమాలీలకు లైసెన్స్‌ల జారీ

- సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్

ఇంద్రవెల్లి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని స్థానిక మార్కెట్ యార్డులో బుధవారం హమాలీలకు ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్ ఆధ్వర్యంలో లైసెన్సులను జారీ చేశారు. ప్రభుత్వం పీఏసీఎస్ ఆధ్వర్యంలో రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం కోసం జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఆరంభించింది. హమాలీల కొరత లేకుండా ప్రభుత్వ నిభందనలు ప్రకారం లైసెన్స్ కలిగి ఉన్న హమాలీలే జొన్నల లోడింగ్, తూకం చేయడం వంటి పనులు చేయాల్సి ఉంది. అయితే వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించిన ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మార్మాట్ ఇంద్రవెల్లి, నార్నూర్ మండలానికి చెందిన హమాలీ లచే దగ్గరుండి లోడింగ్ చేసే ప్రక్రియను పరిశీలించారు. అనంతరం ఇరవై మంది హమాలీలకు లైసెన్సులను జారీ చేశారు. ఈ కార్యక్రమంలో డీసీవో మోహన్, మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖడే ఉత్తం, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ డోంగ్రే మారుతి పటేల్, తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, మార్కెట్ కమిటీ ఈవో దేవన్న, సహకార సంఘం సీఈవో ధర్మసింగ్, డిప్యూటీ సీఈవో తుమ్మల సునీల్, తదితరులు పాల్గొన్నారు.



ఆదివాసీ మహిళలకు పింఛన్ మంజూరు చేస్తున్న అధికారులు

'పైలెట్ ప్రజావాణి'తో సత్వర పరిష్కారం

- స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గంగాధర్

నార్నూర్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ప్రాంత ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్న సమస్యలు పరిష్కారం చేయడానికి పైలెట్ ప్రజావాణి ప్రజా ఫిర్యాదుల కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని మండల ప్రత్యేక అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(ఎస్‌డీసీ) గంగాధర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద నిర్వహించిన పైలెట్ ప్రజావాణి కార్యక్రమానికి నలుములల నుంచి ప్రజల అధికసంఖ్య ఫిర్యాదులు వచ్చాయి. ప్రజావాణి బహిరంగ విచారణలో భాగంగా పూసం లక్ష్మీబాయికు బాబేఝరి గ్రామ వాసినికు స్పౌజ్ వితంతు పింఛన్ మంజూరు చేశారు. దీంతో పాటు గ్యాస్ సబ్సిడీ సమస్యలు కూడా పరిష్కరించారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో ప్రభాకర్, ఎంపీడీవో జవహార్, సుపరింటెండెంట్ గంగాసింగ్, డిప్యూటీ తహసీల్దార్ శ్యాంసుందర్, మండల వ్యవసాయ శాఖాధికారి ఆకాష్, ఐటీడీఏ అధికారి సోరాబ్జి, పంచాయతీ కార్యదర్శులు, ఎఈవోలు, ఇతర శాఖ అధికారులు పాల్గొన్నారు.


యజ్ఞంలో పాల్గొన్న భక్తులు (ఇన్‌సెట్‌లో దుర్గాదేవి)

ఘనంగా జగదాంబ దేవి విగ్రహ ప్రతిష్ఠ

బోథ్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధన్నూర్(కే) గ్రామంలో బుధవారం జగదాంబ దేవి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం భక్తులు కన్నుల పండువగా నిర్వహించారు. వేదపండితులు నెమలికొండ సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠాపనను నిర్వహించారు. ఈ సందర్భంగా మొదట పుణ్యాహవచనం మండపారాధన, దేవత విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని గావించారు. ఈ సందర్భంగా అమ్మవారిని జలాధి ఫల పుష్ప ధాన్యాదివాసం చేశారు. అనంతరం బుధవారం ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో గ్రామస్థులు మూడు రోజులు అన్న కార్యక్రమాన్ని నిర్వహించగా భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

విత్తన దుకాణాల వద్ద రైతుల బారులు

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): అక్షయ తృతీయ సందర్భంగా బుధవారం ఆదిలాబాద్‌లోని అన్నదాతలు విత్తన దుకాణాలకు క్యూ కడుతున్నారు. అక్షయ తృతీయ నుంచి పంటకు సంబంధించిన పనులను ప్రారంభించడానికి ఆసక్తి చూపారు. విత్తనాలతో పాటు మందులు, పిచికారి సామగ్రి, ఇతర వస్తువులను ఖరీదు చేయడంతో సీడ్స్ దుకాణాల వద్ద సందడి నెలకొంది. అక్షయ తృతీయ నాడు పంట పెట్టుబడి ప్రారంభిస్తే పంట సమృద్ధిగా పండి, లాభాలు వస్తాయని అన్నదాతలు ప్రగాఢంగా విశ్వసిస్తారు.

ఆదిలాబాద్‌లో 'ఆపరేషన్ చబుత్ర'

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : ఎలాంటి అవసరం లేకపోయినా అర్ధ రాత్రులు రోడ్లపై తిరిగే వారిపై అనవసరంగా సమావేశాలు పెట్టే వారిపై చర్యలు తప్పవని డీఎస్పీ జీవన్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రాత్రి ఆదిలాబాద్‌లో సీఐ, ఎస్ఐలతో కలిసి ఆపరేషన్ చబుత్ర నిర్వహించి స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. అకారణంగా రోడ్లపై తిరుగుతున్న యువకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. మరోసారి రోడ్లపై కనిపిస్తే కేసులు నమోదు చేస్తామని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు.


మాట్లాడుతున్న డీఎస్పీ జీవన్ రెడ్డి


ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులను సన్మానిస్తున్న జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

ఉద్యోగ విరమణ సర్వ సాధారణం : ఎస్పీ

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): పోలీసు వ్యవస్థలో ఉద్యోగ విరమణ సర్వ సాధరమని ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ పేర్కొన్నారు. బుధవారం ఉద్యోగ విరమణ పొందిన ఏఎస్సై రాథోడ్ ప్రకాష్, హెడ్ కానిస్టేబుల్ కేంద్ర వెంకట్రావులను కుటుంబ సమేతంగా పోలీసు ముఖ్య కార్యాలయానికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యుల సమక్షంలో ఉద్యోగ విరమణ పొందిన వారిని శాలువా, పూల మాలలతో సత్కరించి జ్ఞాపికలను అందజేసి సాగనంపారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ పదవీ విరమణ అనంతరం ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ కుటుంబ సభ్యులతో సంతోషంగా జీవించాలన్నారు. రాథోడ్ ప్రకాష్ ప్రస్తుతం ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో ఏఎస్సైగా విధులు నిర్వహిస్తున్నాడన్నారు. 1989లో పోలీసు వ్యవస్థలోకి అడుగు పెట్టి 2012లో హెడ్ కానిస్టేబుల్, 2018లో ఏఎస్సైగా పదోన్నతి పొంది ఉమ్మడి జిల్లాలో విధులు నిర్వహించారని తెలిపారు. అలాగే, కేంద్రవెంకట్రావ్ 1990లో కానిస్టేబుల్‌గా చేరి 2018లో హెడ్‌కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందారన్నారు. సర్వీసులో ఎక్కువ కాలం సంఘవిద్రోహ శక్తులతో పోరాటంలో కీలకపాత్ర పోషించారని అన్నారు. ఇందులో అదనపు ఎస్పీ బి.సురేందర్‌రావు, సీసీ కొండరాజు, ప్రజా ఫిర్యాదుల విభాగం అధికారిని జైస్వాల్‌కవిత, పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు, తదితరులున్నారు.

బాబోయ్.. కుక్కల బెడద!

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్‌లోని ఇందిరమ్మ కాలనీలో కుక్కల బెడద తీవ్రంగా ఉందని హ్యాండీక్యాప్డ్ హెల్పింగ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు మహమ్మద్ ఇమ్రాన్ అన్నారు. ఇటీవల కుక్కల దాడుల్లో కోళ్లు మృతి చెందాయని.. అదేవిధంగా మనూరు కాలనీవాసులపై దాడి చేశాయని ఆయన పేర్కొన్నారు. కుక్కల బెడద నివారించాలని కోరుతూ బుధవారం మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజుకు వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా కాలనీలో మంచినీటి సమస్యను పరిష్కరించాలని కోరారు.

గాలికుంటు టీకాలు వేయించాలి

నేరడిగొండ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): పశు పోషకులు, రైతులు పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారి రాథోడ్ జీవన్ అన్నారు. బుధవారం మండలంలోని మాల్కోద్ది, కుంటాల కే గ్రామాలలో పశువులకు సామూహిక ఉచిత గాలికుంటు నివారణ టీకాలు వేశారు. రైతులు వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమపై దృష్టి సారించాలని అన్నారు. పశువులకు వ్యాధులు సోకకుండా ముందస్తుగా నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


నివారణ టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి రాథోడ్ జీవన్

65 ఆశ్రమ పాఠశాలల్లో వంద శాతం ఫలితాలు

- డీడీకీ అభినందనలు తెలిపిన ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తా

ఉట్నూర్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆదిలాబాద్‌లోని 65 గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో వంద శాతం ఫలితాలు సాధించడం అభినందనీయమని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా అన్నారు. మొదటిసారి ఇంగ్లీష్ మీడియం యందు పరీక్ష రాయగా.. ఆశ్రమ పాఠశాలలో పదవ తరగతి ఫలితాలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించడం శుభపరిణామం అన్నారు. బుధవారం పదవ తరగతి పరీక్ష ఫలితాలలో ఉమ్మడి ఆదిలాబాద్ ఆశ్రమ పాఠశాలలో 65 ఆశ్రమ పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించాయని ఐటీడీఏ పీవో అన్నారు. ఇదే మాదిరిగా వచ్చే విద్యా సంవత్సరంలో ఉమ్మడి ఆదిలాబాద్ ఆశ్రమ పాఠశాలలు అన్ని వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా నాణ్యమైన విద్యను అందించేలా ప్రతి ఆశ్రమ పాఠశాలలో మౌళిక వసతుల కల్పనకు కృషి చేస్తానని ఈ సందర్భంగా తెలుపుతూ విద్యార్థులను అభినందించారు.

- పదవ తరగతి పరీక్ష పలితాలు సంవత్సరాల వారీగా..

1) ఆదిలాబాద్ : 2023 -2024 గత యేడాది 91 శాతం
2024-2025 ఈ యేడాది 99 శాతం
2) నిర్మల్ : 2023-2024 గత యేడాది 100 శాతం


జిల్లా గిరిజన సంక్షేమ అధికారికి స్వీట్లు తినిపిస్తున్న ఐటీడీఏ పీవో

2024-2025 ఈ యేడాది 98 శాతం
3) ఆసిఫాబాద్ 2023-2024 గత యేడాది 92 శాతం
2024-2025 ఈ యేడాది 93 శాతం
4) మంచిర్యాల : 2023-2024 గత యేడాది 91 శాతం
2024-2025 ఈ యేడాది 95శాతం. ఫలితాలు వచ్చాయన్నారు. ఈ మేరకు జిల్లా గిరిజన సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజిని ప్రాజెక్టు అధికారి అభినందించి స్వీట్లు తినిపించారు.

'పది' ఫలితాల్లో జిల్లాకు తొమ్మిదో స్థానం

ఆదిలాబాద్ రూరల్: విద్యార్థి దశలో అత్యంత కీలకంగా భావించే పది పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయి. రాష్ట్రంలో ఆదిలాబాద్ జిల్లా తొమ్మిదో స్థానంలో నిలిచింది. గతేడాది జిల్లా 17వ స్థానంలో నిలవగా, ఈ ఏడు మెరుగైన స్థానం దక్కడం విశేషం. మార్చిలో జరిగిన పరీక్షలకు 10,050 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో 9767 మంది ఉత్తీర్ణత సాధించగా మొత్తంగా 97.40 శాతం ఉత్తీర్ణతతో జిల్లా తొమ్మిదో స్థానంలో నిలిచిందని డీఈవో శ్రీనివాసరెడ్డి తెలిపారు.

- మేటి ఫలితాలు సాధించిన బాలికలు

ఉట్నూర్: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో పదవ తరగతి పలితాల్లో మేటి ఫలితాలను బాలికలు సాధించారు. దీనిలో భాగంగా మండల కేంద్రంలోని సన్ షైన్ పాఠశాలకు చెందిన అశ్విత 575 మార్కులు, వంశిక 571, ఆదిత్య నాయక్ 565 మార్కులు సాధించారు. అలాగే, లిటిల్ ఫ్లవర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల 100 శాతం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 91, సరస్వతీ జ్ఞాన విద్యాలయం 97, పూలాజిబాబా కాన్సెప్ట్ స్కూల్ 99, తెలంగాణ మైనార్టీ స్కూల్ 89, పలు పాఠశాలలు ఉత్తమ ఫలితాలను సాధించాయి.


బసవేశ్వర విగ్రహానికి పూలమాల వేస్తున్న జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే



జైనథ్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజార్షిషా

బసవేశ్వర జీవితం అందరికీ ఆదర్శం

- జయంతి వేడుకల్లో జిల్లా కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): బసవేశ్వర జీవితం అందరికి ఆదర్శ ప్రాయమని జిల్లా కలెక్టర్‌రాజార్షిషా అన్నారు. బుధవారం పట్టణంలోని బసవేశ్వర చౌక్ వద్ద నిర్వహించిన బసవేశ్వర జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే పాయల శంకర్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో స్త్రీ పురుషులిద్దరు సమానమేనన్న భావనను ప్రజల్లో తీసుకువెళ్లి సమ సమాజ స్థాపనకు కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. ఆయన జీవిత చరిత్ర పాఠ్య పుస్తకాల్లో ఉందని, అలాంటి మహనీయుల చరిత్రను చదివి తాము స్ఫూర్తి పొందామని గుర్తు చేసుకున్నారు. ఆ మహనీయుల ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని కలెక్టర్ ఈ సంధ్బంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారి రాజలింగు, అన్నదానం జగదీశ్వర్, బీసీ సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చిక్కాల దత్తు, కలాల శ్రీనివాస్, పలువురు బీసీ సంఘాల నాయకులు, లింగాయత్ సమాజ్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

- భూభారతిలో భూ సమస్యల సత్వర పరిష్కారం

జైనథ్: రాష్ట్రంలో అధికారంలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన భూభారతితో జిల్లాలో ఉన్న భూ సమస్యలను సత్వరంగా పరిష్కరిస్తామని జిల్లా కలెక్టర్ రాజార్షిషా అన్నారు. బుధవారం జైనథ్ మండల కేంద్రంలోని లక్ష్మీనారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భూభారతి చట్టంపై అవగాహన సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పలు అంశాలపై రైతులకు ప్రజలకు సలహాలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ శ్యామలదేవి, తహసీల్దార్ ఆత్రం నారాయణ, జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎ.అశోక్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్లు రుకేష్‌రెడ్డి, ఎంపీడీఓ రవీంద్రనాథ్‌లతో పాటు తదితరులు పాల్గొన్నారు.